ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం

- సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతాం
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: బసవతారకనగర్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి పూర్తి న్యాయం చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్థానికులకు హామీ ఇచ్చారు. గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బసవతారక నగర్‌వాసులు ఎమ్మెల్యే గాంధీని శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీ స్పందిస్తూ బసవతారక నగర్‌వాసుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. కాగా అంతకుముందు బసవతారకనగర్‌వాసులు గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారికి న్యాయం చేయాలని కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ఎమ్మెల్యేకి వివరించారు.


ఎమ్మెల్యే గాంధీని కలిసిన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, బసవతారకనగర్‌వాసులు

అలరించిన కథక్‌, భరతనాట్య ప్రదర్శన




మాదాపూర్‌: శిల్పారామంలో శనివారం కాలిఫోర్నియా, యూఎస్‌ఏకి చెందిన తరుణి కొవెలంపూడి భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించింది. ఇందులో విఘ్నరాజం భజే, ఎందరో మహానుభావులు, కళింగనర్తనం తదితర అంశాలను ప్రదర్శించారు. అలాగే తరంగిణీ కథక్‌ అకాడమీ గురు శ్రీసుబ్రత్‌ సర్కార్‌ శిష్య బృందం కథక్‌ నృత్యంతో ఆకట్టుకున్నారు. ఇందులో గణేశవందన, కృష్ణవందన, తీన్‌తాల్‌, సరస్వతీ వందన తదితర అంశాలను తనిష్క, అన్య, శీలాసింగ్‌, భావన, నేహ, శ్రియ, ఆరాధ్య, ఆంచల్‌ తదితరులు ప్రదర్శించారు.

మెరిడియన్‌ స్కూల్‌లో ప్రతిబింబ్‌- 2024


నృత్యం చేస్తున్న విద్యార్థులు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని మెరిడియన్‌ స్కూల్‌లో శనివారం సాహి ప్రతిబింబ్‌- 2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంటర్‌ స్కూల్‌ కాంపిటీషన్‌కు నగరంలోని 51 పాఠశాలలకు చెందిన సుమారు 3వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇండోర్‌ గేమ్స్‌, సంగీతం, ఫ్యాషన్‌ షో, చిత్రలేఖనం, నాటకాలు తదితర విభాగాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. విభిన్న రకాల వేషధారణలతో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మెరిడియన్‌ విద్యాసంస్థల ఫౌండర్‌ బుట్టారేణుక తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపల్‌ కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌ ఆసుపత్రిలో ఈఎన్‌టీ సమ్మిట్‌


సమ్మిట్‌లో పాల్గొన్న డా.సంపూర్ణఘోష్‌, వైద్యులు

మాదాపూర్‌: వైద్యవిద్యలో ప్రత్యక్ష ప్రదర్శనలు ముఖ్యమని, వాస్తవ విధానాలను చూసి నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఈఎన్‌టీ సర్జన్‌ డాక్టర్‌ సంపూర్ణఘోష్‌ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆసుపత్రిలో శనివారం అంతర్జాతీయ ఈఎన్‌టీ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎన్‌టి రంగాన్ని అభివృద్ధి చేయడానికి, సహకారం అందించడానికి ప్రాక్టీషనర్ల నైపుణ్యాలను పెంపొందించడానికి ఒక ముఖ్యమైన వేదిక అని తెలిపారు. ఈ సదస్సులో యాంటీరియల్‌ స్కల్‌బేస్‌, మిడిల్‌ ఇయర్‌, ఇన్నర్‌ ఇయర్‌, ఇంప్లాంట్‌, ఎయిర్‌వే, మేనేజ్‌మెంట్‌ వంటి క్లిష్టమైన వాటిలో నైపుణ్యం, పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. ఈ సమ్మిట్‌లో మెడికవర్‌ హాస్పిటల్‌ డాక్టర్‌ శరత్‌రెడ్డి, జాతీయ, అంతర్జాతీయ ఈఎన్‌టీ వైద్యులు 400మందికి పైగా నిపుణులు, యువ డాక్టర్లు పాల్గొన్నారు.

బస్తీ దర్శన్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలోని పాషాకాలనీలో శనివారం బస్తీదర్శన్‌ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కార్పొరేటర్‌ పుష్పనగేశ్‌ బస్తీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ బస్తీలో ఉన్న ఓపెన్‌ నాలాలో చెత్త పేరుకుపోయి వర్షపు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు. వెంటనే ఓపెన్‌ డ్రైన్‌ను శుభ్రం చేయించాలని కార్పొరేటర్‌ అధికారులను ఆదేశించారు. పాషాకాలనీ చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ కూలిపోవడంతో మళ్లీ ఫెన్సింగ్‌ వేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె కాలనీలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండగ ఏర్పాట్లను పరిశీలించారు.

హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ అధ్యక్షుడిగా శ్రీధర్‌

పటాన్‌చెరు టౌన్‌: పట్టణానికి చెందిన మెట్టు శ్రీధర్‌ని ఉమ్మడి మెదక్‌ జిల్లా హ్యూమన్‌ రైట్‌ కౌన్సిల్‌ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ప్రధాన కార్యదర్శి విజయ్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ మహేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు వాటి ఉల్లంఘన జరిగినపుడు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు.

బోనాలకు సిద్ధమైన చిత్తారమ్మ ఆలయం


ముస్తాబైన చిత్తారమ్మ ఆలయం


మూసాపేటలో మేకల మంది

మూసాపేట: మూసాపేట చిత్తారమ్మ తల్లి ఆషాఢమాస బోనాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్‌ తూము శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. కాగా గురువారం నుంచే మూసాపేటలో బోనాల పండుగ వాతావరణం నెలకొంది. దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. రాకింగ్‌ స్టార్స్‌ యూత్‌ అసోసియేషన్‌ సభ్యులు గత 20 సంవత్సరాలుగా ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం 5 క్వింటాళ్ల పులిహోరతో పాటు 5 రకాల ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మూసాపేటలో పలు ప్రాంతాల్లో నాటు కోళ్లు, మేకలను వివిధ జిల్లాల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.




ఇరుకు రోడ్డు.. ఇబ్బందులు

నిత్యం ట్రాఫిక్‌ జామ్‌.. రోడ్డు విస్తరణపై అధికారులకు పట్టింపేదీ ?

హఫీజ్‌పేట్‌: డివిజన్‌ పరిధిలోని హఫీజ్‌పేట్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో వాటర్‌వర్క్స్‌ రిజర్వాయర్ల వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. దీనికితోడు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరుస కథనాలతో హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ సమీపం నుంచి రిజర్వాయర్ల ప్రహరీగోడ వరకు రోడ్డు విస్తరణ చేసినప్పటికి అక్కడి నుంచి 200 మీటర్ల వరకు ప్రహరీ వైపు ఉన్న రోడ్డు చిన్నదిగా మారింది. రోడ్డు విస్తరణ చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.

- మాదాపూర్‌ వైపు వెళ్లే వాహనదారులకు ప్రత్యామ్నాయ రోడ్డు ఇది.
- రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్‌ సమస్య తీవ్రంగా ఉంటుంది.
- భారీ వాహనాలు వస్తే ఒక్క వాహనం వెళ్లాల్సిన పరిస్థితి
- రోడ్డు చిన్నదిగా మారడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- జలమండలి ప్రహరీగోడ, దక్షిణ మధ్య రైల్వేల అధికారులతో మాట్లాడి రోడ్డును విస్తరించేలా చర్యలు తీసుకోవాలి
- జలమండలి ప్రహరి గోడను తగ్గించి కొంత మేర రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.
- మియాపూర్‌, మదీనాగూడ, బొల్లారం తదితర ప్రాంతాల వాహనదారులు హైటెక్‌ సిటీకి వెళ్లేందుకు దూరం తగ్గడంతో బాటు ప్రయాణం ఈజీగా ఉంటుంది
- లింక్‌ రోడ్డులో భాగంగా మంజీరారోడ్డు విస్తరణ కూడా చేపట్టాలి
- హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ వద్ద రోడ్డు పక్కనే వేసిన స్క్రాప్‌ డంపింగ్‌ను వెంటనే తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


హఫీజ్‌పేట్‌ జలమండలి ప్రహరీగోడ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు


హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ నుంచి గోకుల్‌ ప్లాట్స్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కన స్క్రాప్‌

రోడ్డు విస్తరణ చేపట్టాలి



హఫీజ్‌పేట్‌ మంజీరా రోడ్డు మార్గాన్ని విస్తరిస్తే మూసాపేట్‌, మాదాపూర్‌కు 10 నిమిషాలలో వెళ్ళవచ్చు. ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్‌ సమస్య ఉండదు. ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తినప్పుడు, వర్షాకాలంలో ఈ రోడ్డు ప్రత్యామ్నాయంగా ఉంది.

– దత్తాత్రేయ, హఫీజ్‌పేట్‌

మరమ్మతులు చేయాలి



హఫీజ్‌పేట్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో ఉన్న ఇరుకు రోడ్డులోని గుంతలకు వెంటనే మరమ్మతులు చేయాలి. ట్రాఫిక్‌ సమస్యను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. రోడ్డు పక్కనే ఉన్న స్క్రాప్‌ దుకాణాలను తొలగించాలి.

– వీరభద్రం , ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌

సీఎంను కలిసిన కార్పొరేటర్‌

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి రూ.10 వేల కోట్లు కేటాయించడంతో సీఎం ఏ.రేవంత్‌రెడ్డికి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పూలమొక్కను అందజేశారు. అంతకు ముందు నాగేందర్‌యాదవ్‌ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నమయ్యపురంలో సంగీత కచేరి




మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మంచిర్యాలకు చెందిన శివప్రియ మ్యూజిక్‌ అకాడమీ గురువు శివప్రియ ఇందారపు శిష్యబృందం సంగీత కచేరీ నిర్వహించారు. కళాకారులు సవిత, సుజాత, హసిత్‌, ఆద్విక, రిష్విత, అద్వైత, కృష్ణదర్శిత, చంద్రహాస, శ్రీరాములు, సుదీక్ష తదితరులు కీర్తనలను మధురంగా ఆలపించారు. కీబోర్డు జి.శ్రీధర్‌, తబలా శ్రీనివాస్‌ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ నిర్వాహకులు శోభారాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో పోచమ్మ ఉత్సవాలకు మాజీ వార్డు సభ్యుడు, సీనియర్‌ కాంగ్రెస్‌ నేత రాజుగౌడ్‌ శనివారం రూ.10వేల విరాళాన్ని అందించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను రక్షించాలని తెలంగాణ మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ బాలకృష్ణ సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్‌ పరిధిలో గల తెలంగాణ మోడల్‌ స్కూల్‌లో శిక్షాసప్త కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌ బాలకృష్ణ మాట్లాడుతూ మొక్క నాటిన ప్రతి విద్యార్థి ఆ మొక్కను కాపాడేలా అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల విస్తరణ

జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి


గచ్చిబౌలిలో రహదారులను పరిశీలిస్తున్న వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి, చందానగర్‌ సర్కిళ్లలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల విస్తరణ చేపడతామని జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మల్కం చెరువు, గచ్చిబౌలి, ఖాజాగూడ, క్యూ మార్ట్‌ జంక్షన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని రోడ్ల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న విద్యుత్‌ స్తంభాలను మార్చాలని అధికారులకు సూచించారు. ఫ్రీ లెఫ్ట్‌తో పాటు రహదారుల విస్తరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టౌన్‌ ప్లానింగ్‌, ఎలక్ట్రిసిటీ విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. రహదారుల విస్తరణలో చెట్లను నరకవద్దని, సురక్షిత పద్ధతిలో ట్రాన్స్‌లొకేట్‌ చేయాలన్నారు. రోడ్ల వెంట గోడలపై ఆలోచింపజేసే అందమైన చిత్రాలను వేయించాలని, అందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. ప్రతి కూడలి శుభ్రంగా ఉంచాలని, చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శంకర్‌, యూబీడీ డిప్యూటి డైరెక్టర్‌ అనిల్‌, ఈఈ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాలి


మాట్లాడుతున్న ఆచార్యులు కిశోర్‌కుమార్‌

మాదాపూర్‌: రోజురోజుకు జనాభా పెరిగిపోతుండడంతో జీవనశైలిలో అనేక మార్పులు వచ్చాయని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఎర్త్‌, ఓషన్‌, అట్మాస్పియర్‌ సైన్సెస్‌ ఆచార్యులు జి.కిశోర్‌కుమార్‌ తెలిపారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మాదాపూర్‌లోని జిల్లాపరిషత్‌ హైస్కూల్‌లో పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు రోజురోజుకు తగ్గిపోవడంతో పాటు వృథా చేస్తుండడంతో పర్యావరణంపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. భూమిపై జీవరాశి బతకాలంటే సహజ వనరులైన గాలి, నేల, నీరు, మొక్కలు, ఖనిజాలు సమస్థితిలో ఉండాలన్నారు. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామియాదవ్‌, అసోసియేషన్‌ సభ్యులు కొత్తపల్లి కోటేశ్వరరావు, అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్శిటీ మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్‌ వెంకటధర్మసాగర్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవలింగం, విద్యార్థులు పాల్గొన్నారు.



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల రోడ్లతో పాటు పారిశ్రామికవాడల రోడ్లు గుంతలమయంగా మారాయి. గడ్డపోతారం, బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడల్లోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. శివానగర్‌ నుంచి చిన్నకంజర్ల వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన శివానగర్‌- చిన్నకంజర్ల రోడ్డు

'సంస్కృతి'లో బోనాల ఉత్సవాలు



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌లో శనివారం బోనాలు ఉత్సవాలు నిర్వహించారు. పోతురాజులు, అమ్మవార్ల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు.

బోనాల ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్‌



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి గ్రామంలోని చిత్తారమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగను పురస్కరించుకొని వివేకానందనగర్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి జీహెచ్‌యంసీ అధికారులు, పోలీస్‌ డిపార్టుమెంట్‌, లా అండ్‌ ఆర్డర్‌, ట్రాఫిక్‌ అధికారులతో కలిసి డివిజన్‌లోని అన్ని దేవాలయాలను పరిశీలించారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు.

ఆకస్మిక వాహన తనిఖీలు

పటాన్‌చెరు: విజిలెన్స్‌, రవాణాశాఖ అధికారులు శనివారం తెల్లవారుజామున పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది వాహనాలు రసీదులు లేకుండా ఇసుక, రాయి, మెటల్‌ను ఓవర్‌లోడ్‌తో తీసుకెళ్తుండగా ఆ వాహనాలకు జరిమానా విధించారు. సీనరేజీ పన్ను కింద రూ. రెండు లక్షల ఇరవై వేలు జరిమానా విధిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా ఒక లారీ డ్రైవర్‌ లారీని వదిలిపెట్టి పరారవడంతో ఆ లారీని పటాన్‌చెరు పోలీసులకు అప్పగించి సీజ్‌ చేశామన్నారు. ఈ తనిఖీల వివరాలను విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రేకులు ఫెయిల్‌.. ఫుట్‌పాత్‌ పైకి లారీ



ఆల్విన్‌కాలనీ: లారీ బ్రేకులు ఫెయిలై అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన వివేకానందనగర్‌ కమాన్‌ వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి వైపు భారీ లోడ్‌తో వస్తున్న లారీ కూకట్‌పల్లి వివేకానందనగర్‌ వద్ద బ్రేకులు ఫెయిల్‌ కావడంతో అదుపుతప్పిన లారీ ఫుట్‌పాత్‌ పైకి దూసుకెళ్లింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌ జామ్‌ అయ్యింది. ట్రాఫిక్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్‌: తన భర్త ఫోన్‌ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌ మండల పరిధిలోని పటేల్‌గూడ సృజన లక్ష్మీనగర్‌కి చెందిన ప్రవీణ్‌ (38) ఈనెల 24వ తేదీ సాయంత్రం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో భార్య స్వప్న తెలిసిన వారి వద్ద ,స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఫిలింనగర్‌: వినాయకనగర్‌ బస్తీలోని శ్రీఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 30 వరకు శ్రీ వినాయకనగర్‌ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం కలశారాధన, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 30న శ్రీఈదమ్మ, శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, బోనాల సమర్పణ ఉంటాయని, అదే రోజు రాత్రి తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుందని తెలిపారు.

ఇది రోడ్డే..


బీరంగూడ గుట్ట ఆలయానికి వెళ్లే రోడ్డు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలో వేసిన రోడ్లు కొన్నాళ్లకే పాడవుతున్నాయి. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులకు మున్సిపల్‌ పాలకవర్గం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్‌ సమావేశాల్లో తమ వార్డుల్లో ఉన్న పరిస్థితిని చర్చించినా ఫలితం లేదని కొందరు కౌన్సిలర్లు బాహాటంగానే వాపోతున్నారు.

దొంగ రిజిస్ట్రేషన్‌ చేసినందుకు ఏడేళ్ల జైలు

మాదాపూర్‌: ఒకే స్థలాన్ని రెండుసార్లు రిజిస్ట్రేషన్‌ చేసి మోసం చేసిన యజమానులకు శిక్షపడిన సంఘటన మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖానామెట్‌లో సర్వే నంబర్‌ 21లోని 19 గుంటల స్థలానికి ఓరుగంటి జీతయ్య, ఓరుగంటి బాలేష్‌లు యజమానులు. 1994లో వారు 10 గుంటల స్థలాన్ని లీలావతిరెడ్డికి, మిగిలిన 9 గుంటల స్థలాన్ని డి.కామాక్షికి విక్రయించారు. వీరు 2008లో ఆ స్థలాన్ని జి.వెంకటేశ్వరరావుకు అమ్మారు. 2015లో ఇదే స్థలాన్ని ఓరుగంటి జీతయ్య, ఓరుగంటి బాలేష్‌లు సయ్యద్‌ ముస్తాక్‌, హుస్సేన్‌ నవీద్‌, మహమ్మద్‌ ముజాఫర్‌ హుస్సేన్‌కు మళ్లీ రిజిస్ట్రేషన్‌ చేశారు. మోసం చేసినందుకుగాను నిందితులు ఓరుగంటి జీతయ్య, ఓరుగంటి బాలేష్‌లకు 10వ అడిషనల్‌ మెట్రోపాలిటన్‌ మేజిస్ట్రేట్‌ 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ.6వేల రూపాయల జరిమానా విధించారు.